# జీవన్మృతుడు

శ్రీ. పి. శ్రీనివాసరావు

పోలీస్ రామదాస్ చూస్తున్నాడు. చూచి విస్తుపోయాడు. కనురెప్ప పాటులోనే కళ్ళు చెదిరే కథనాలు దొర్లిపోయాయి. తను చూస్తుండగానే ఆ విషమస్థితి సంభవించింది. అందుకే విస్మయం.

బహిరంగ సభలు నిషేధించబడ్డాయి అన్నాడు పోలీస్ యిన్‌స్పెక్టర్.

యిండో చైనావీరులపట్ల సానుభూతి తెలిపే సభని శాంతియుతంగా జరపడంలో తప్పులేదన్నారు విద్యార్థులు.

సభ జరగడం అసంభవం అన్నాడు మళ్ళీ యిన్‌స్పెక్టర్. యెందుకసంభవం అనుకున్నాడు రామదాస్.

విద్యార్థులలోంచి గుసగుసలు రామదాస్ చెవిని సోకాయి.

బహిరంగసభ జరిపే స్వేచ్ఛలేదూ?

యిండో చైనా ప్రజలుకూడా తమలాగే దాస్య విముక్తికోసం పోరాడుతుంటే ప్రత్యక్ష సహాయంచేయలేకుంటే సానుభూతి ఐనా ప్రకటించగూడదా కనీసం?

"హింసకు గురిఐనాసరే సభ జరిపితీరాలి!"

జండా ప్రతిష్ట, జాతీయగీతాలాపన, జరిగినై. అధ్యక్షుడు యిండో చైనా ప్రతిఘటన వివరించాడు. యిన్‌స్పెక్టర్ వాడి చూపుల్ని రామదాస్ అప్పుడు కనిపెట్టాడు.

వుపన్యాసం విజృంభించడం, సభికులు ఉద్రేకపూరితులవడం, గుర్తించాడు.

సమావేశమైన వాళ్ళందరూ వెళ్ళకుంటే లాఠీఛార్జి చేయవలసివస్తుందని హెచ్చరించాడు యిన్‌స్పెక్టర్.

తీవ్రత రామదాస్‌కు అర్థమైంది.

"మేము వెళ్ళం! యిక్కడనుంచి మీరే వెళ్ళండి!" వుగ్రులైన యువకుల కంఠాలు రామదాస్ చెవుల్లో ఖంగుమన్నాయి.

యిన్‌స్పెక్టర్ అధికారం పూర్వకంగా మళ్ళీ హెచ్చరించాడు సభను ఆపివేయకుంటే లాఠీ ఛార్జి తప్పదని.

సమావేశంనుంచి "పోలీస్ జులుం నశించాలి." కేకలు రణభూమి తూర్యారవాలయాయి.

యిన్‌స్పెక్టర్ కనుసన్నతో హింసా యంత్రం మీట నొక్కాడు. రామదాస్‌కూడా తన ధర్మం నెరవేర్చాడు. అరాచకం నాట్యమాడింది సమావేశంలో— పారిపోయే వాళ్ళని రామదాస్ వెంబడించలేదు. యెక్కువభాగం యువకులు ధృఢంగా నిలిచిపోవడం రామదాస్‌కు ఆశ్చర్యం కలిగించింది. యింతలోనే రాళ్లువచ్చి పడినై. గూండాలచర్యఐవుండొచ్చు అని వూహించాడు రామదాస్. అవి మందుగుండు కర్మాగారంమీద నిప్పురవ్వలయాయి.

అక్కడితో నూతనాధ్యాయం ప్రారంభమైంది. దాని తర్వాత ఘట్టాలు తెరమీద చిత్రాల్లా గిర్రున తిరిగిపోయి అతనికి లీలగా తోచాయి. జనం పోగడడం, కోలాహలం అధికమవడం, రాళ్ల వర్షంతో యిన్‌స్పెక్టర్‌కి తదితరులకి గాయాలు తగలడం, యివన్నీ పై అధికార్లనుంచి తుపాకీ ప్రయోగానికి వుత్తర్వు జారీ చేయబడ్డానికి దారితీశాయి.

తుపాకులు పేల్తుంటే, ప్రాణ రక్షణకోసం పారిపోతున్నారు. కాని యెక్కడనుంచి వస్తున్నయో రాళ్లు?

రామదాస్ వ్రేళ్ళు తుపాకి "ట్రిగ్గర్" మీదనే నిలిచిపోయాయి. కొన్నిక్షణాలు శూన్యంగా ఆలోచిస్తు ఆగాడు. అతడి భావాంబరవీధిలో కొడుకు చిత్రం తళుక్కుమన్నది. అతని చేతులాడలేదు.

పుట్టక పుట్టక పుట్టిన గారాబుకొడుక్కి చెడు బుద్ధులు పుట్టాయి. తనవంశీయులు అనాదినుంచీ ప్రభుత్వం వుప్పుతిని విశ్వాసంతో సేవజేస్తూవచ్చారు కానీ కొడుకు పెడమార్గాన నడవసాగాడు. మంద

లిస్తే వొక్కకొడుకూ తమవెక్కడ పరిత్యజించి పోతాడో అన్న భయమాయె. యాదవకులంలో ముసలంలాంటి కొడుకని చాటుమాటున పడగడంతో వాడు లెక్కపెట్టకపోయాడు. సీసం కరిగినప్పుడే దెబ్బవేసి వంచడం సాధ్యమవుతుందేగానీ, అటు తర్వాత వంచడానికి సాధ్యంగాదు.

వాడుకూడా యీ సమావేశంలో వున్నాడేమో, అనుమానం అంకురిస్తూనే, అతని గుండెల్లో అలజడి బయల్దేరింది. రాచకీయాలమీద అభిరుచి, యితరరుచులు సమ్మిళితం అయినవి. కాంగ్రెస్ ప్రభుత్వాలొచ్చాక మరీ అసాధ్యుడయాడు.

రామదాసు యెన్నడూ యిలాంటి మానసిక నిర్బలత్వానికి గురికాలేదు. యిన్నేళ్ళబట్టి పోలీసు ఉద్యోగం చేస్తున్నాడు. మనసు కరుడుగట్టి పోవడంవల్ల కలిగే వేదన కతీతుడైనాడు. కానీ యెందుకలా తనధారుఢ్యం ద్రవించిపోవడం? హృదయం కలవరంలో కళవళపడుతూంటే అతనికి చేతులాడలేదు. తుఫానులో గడ్డిపోచలా తన కొడుకెక్కడ వున్నాడో? గాయాలేమన్నా తగిలినవేమో? అందోళన...అందోళన...

తుపాకి ప్రయోగించడం మనసొప్పుతుందా? వొప్పదు. గనుకే ప్రయోగించలేదు. యినస్పెక్టర్ గర్జనలు ఆరొదలో రివ్వుమన్నాయ్. రామదాస్ తుపాకి విసర్జించాడు. విసర్జించి సమూహంలోనికురికాడు. కొడుకుని గట్టిగాపిలిచాడు. పిలిస్తే యెవరికి వినిపిస్తుంది? వినిపిస్తేమటుకు యెవరు జవాబిస్తారు? 'స్వరక్షణే పరమధర్మం. పలాయనమే పరమసూత్రం' అతని బూట్లకాళ్లు అందరి కాళ్లమీద ముద్రలువేస్తు




* ఏజంట్లు లేనిచోట్ల ఏజంట్లు కావాలి *

న్నాయ్. చేతులు ముందుకు యీదుతున్నాయ్. అతడికే తుపాకి గుండ్లుతగిలితే? కొడుకు. కొడుకు భద్రంగావుంటే చాలు. గాలించాడు...మళ్ళీగాలించాడు. గాలించబట్టే గాలిలో లీనమయాడా? రామదాస్ ఆత్రంగా యింటికి పరుగుతీశాడు.

* * *

యింట్లో దృశ్యంచూచాడు. చూచి హతాశుడయాడు రామదాస్. యిందుకేనా—దీన్నిసూచిస్తూనేనా—తనహృదయంలో అర్థంగాని ఆరాటం?

కొడుకు గాయాల్తో స్మారకంలేకుండా పడివున్నాడు. మూలనజేరి ఆడవాళ్లు ముఖారిరాగంలో మునిగితేల్తున్నారు. కొడుకు అన్నిగాయాల్తోదక్కేవుపాయం యేమన్నావున్నదా? డాక్టర్ కూడా నాలిక చప్పరించాడట.

తనసర్వస్వం అనుకున్నకొడుకు ఆ లోకానికి యాత్రచేయనున్నాడు. అలాంటప్పుడు తనజీవితయాత్ర యెలా పరిణమిస్తుందో? తన రాక్షస వుద్యోగంతో యెంతమందిని హింసించాడో? యెంతమంది తలిదండ్రులకి పుత్రశోకం ప్రాప్తింపచేశాడో? శోకరిహృదయాల్ని గాయపరచినందుకు ప్రతిఫలం యిలా లభించింది కాబోలు.

రామదాస్‌కు కొడుకులేకుండినా బాగుండేది. మూన్నాళ్ల ముచ్చటతో మురిపించడం,—అంతేనా కొడుకు విషయం? విలువైనవస్తువు హస్తగతమై తిరిగీ అది మాయమవడం యెవరికైనా హృదయవిదారకమే. అటు ప్రభుత్వాన్నిగానీ, గారాబంతో హద్దులేకుండా పెంచినతల్లినిగానీ, ఆఖరికి కొడుకునిగానీ, నిందించి ప్రయోజనం లేదు.

యివన్నీ మానవజ్ఞానపరిధికి అవలనుండే విషయాలు.

యింతలోనే అతడికి పై అధికారులనుంచి పిలుపువచ్చింది తక్షణం వచ్చి తన ప్రవర్తనకు సంజాయిషీ యిచ్చుకోమని. కాలు విరిగి మొర్రో అంటున్న వ్యక్తిని నాట్యం చేయమన్నట్టున్నది వ్యవహారం. కొడుకు ప్రాణంకంటె వుద్యోగం యెక్కువా? వుద్యోగానికి బదులు మరొకటి సంపాయించవచ్చు. కొడుకుని సంపాయించగలడా? "యేమయినా చేసుకోండి. నేను యిప్పుడు రాలేను." అన్నాడు.

డాక్టర్ వస్తున్నాడు. పోతున్నాడు. సానుభూతి వెల్లివిరిసి బంధుకోటివారువచ్చి పోరాడుతున్నారు. రామదాస్‌కు అంతా బూటకంగాతోచింది. కొడుకుమీదనే ధ్యాస-ఆహారం. ఆరామాలు, శేవ. వుద్యోగంమీద కాస్త శ్రద్ధకూడా చూపనున్న వారిని చూచి రామదాస్ జాలిపడ్డాడు, వారి అమాయకత్వానికి—

రెండురోజులు గడిచినై యెప్పుడో వోకమారు కళ్లుతెరిచినా కొడుకు మాట్లాడేంతశక్తిలో కనిపించలేదు. మథనపడేహృదయం అతడికళ్లలో మాత్రం ప్రతిబింబిస్తోంది. కొడుకు జీవనసంధ్య సమీపిస్తున్నదని తనకు తెలుసు.

ఆఖరికి మరణవేదననుంచి కొడుకు విముక్తి చెందాడు. శోకంతోయెండి బీటలువారిన గుండెల్తో రామదాస్ కన్నీరు కార్చలేకపోయాడు. హఠాత్తుగా మరణిస్తే దుఃఖించేవాడేమోగానీ, కొడుకు బ్రదకడం కల్ల అని నిశ్చయమవడంవల్ల రామదాస్ కొంతసేపులోనే పరితపించి వూరుకున్నాడు.

గాయంమీదనే మళ్లీ దెబ్బతగిలింది. అధికారులనుంచి వుత్తరం వచ్చింది అపాయకరమైనస్థితిలో డ్యూటీవదిలిపోయి పైగా ఆప్రవర్తనకు సంజాయిషీ యివ్వడానికి వొప్పుకోనందుకు తనని వుద్యోగంనుంచి తొలగించామంటూ—రామదాస్ పెదిమలమీద వికటమైన నవ్వు మెరిసింది.

పోనీ! యెవడికొక్కవాలి వుద్యోగం? యెవరిని వుద్ధరించేందుకు?

చితికిన రామదాస్ హృదయం మళ్లీ అతకదు. అంతే! అతను జీవన్మృతుడు!